# పరుగు పరుగుపరుగుపరుగుపరుగుపరు పరుగు

త్రిపురనేని రాంగోపాల్

"ఊఁ...పరిగెత్తు"

"అబ్బా! ఆయాసంగా వుంది."

"ఫర్వాలేదు. అయినా ఫర్వాలేదు. లేకపోతే ఓడిపోతావ్!"

"ఊఁ! కమాన్!"

"సరే!"

*　　*　　*

"ఊఁ! పరిగెత్తు!"

"చాలా దూరం నుంచి పరిగెత్తుకొస్తున్నాను. కాళ్ళు నొప్పులుగా ఉన్నాయ్. ఇంకా స్త దూరం పరిగెత్తితే కాళ్ళు పడిపోతాయని భయంగా వుంది. చచ్చిపోతానేమోనని బాధగా వుంది."

"ఇదిగో! ఈ వెధవ చాదస్తాలే పనికిరావ్! ఇంతకు ముందు ఒకడొచ్చాడు. కుర్రాడిలా వున్నాడు. నీలాగే వాడూ చేతగాని మాటలు మాట్లాడాడు. కాని చివరికి పరిగెత్తాడు. నీవు మరీ అసమర్థుడిలా వున్నావ్! ఇలా అయితే అయినట్లే. ఈ దేశం బాగుపడ్డట్లే!"

"సారీ! క్షమించండి సార్! నాకు ఏ భయం లేదు. పరిగెడతాను. ఆయాసం వచ్చినా, కాళ్ళు పడిపోతాయనుకొన్నా, చచ్చేటట్లున్నా పరిగెడతాను."

"అది! అలా వుండాలి. కమాన్! క్విక్!"

"యస్ సార్."

*　　*　　*

"ఏమిటి? అందరూ పరిగెడుతుంటే. నీవు నడుస్తున్నావా? సిగ్గులేదూ?"

"..........."

"ఉత్త పిచ్చి వెధవలా వున్నావ్. ఇలా అయితే నీవు బాగుపడవ్. అందరూ నిన్ను చూసి నవ్వుతారు. జాగ్రత్త! ఊఁ! పరిగెత్తు!"

"నువ్వెవరివి?"

"నీ కనవసరం."

"కాదు! నాకవసరం."

"నువ్వెవరివి?"

"మనిషిని!"

"నేనూ అంతే!"

"అవును! నువ్వు మనిషివే. కాని నీ గురించి నువ్వు అలా అనుకోవటం లేదు. మామూలు మనుషులకంటే ఎదిగిపోయాననుకుంటున్నావ్. ప్రత్యేక విలువలేవో నీలో వున్నాయనుకుంటున్నావ్. మనుషుల మధ్య నుంచి వేరుచేసే అతీత శక్తులేవో నీలో వున్నాయనుకుంటున్నావ్ కదూ?"




"అవును! నిజానికంతే గూడా! అందుకే ఎంతోమందికి జీవితపు విలువ లను తెలిపి ముందుకు నడిపించగలుగు తున్నాను."

"అబద్ధం! నువ్వు వాళ్ళను నడిపించ టల్లేదు! పరిగెత్తిస్తున్నావ్. వాళ్ళకు జీవి తపు విలువల్ని తెలుపుతున్నానని భ్రమ పడుతున్నావ్. వాళ్ళలో నీవు పెంచుతు న్నది తాపత్రయం మట్టుకే."

"ఏడ్చావ్! మనుషులను నువ్వు ఇలా అర్థం చేసుకుంటున్నావ్ కాబట్టే, ఇలా వున్నావ్! అయిందేదో అయింది. ఇప్పటి కయినా కళ్ళు తెరు. పెరిగిపోతున్న పోటీని చూడు. నా మాట విను-పరిగెత్తు."

"ఎక్కడికి?"

"నన్ను ఈ ప్రశ్న ఎవరూ వేయ లేదు."

"నేను వేస్తున్నాను చెప్పు."

"నాకే తెలియదు."

"ఆ విషయం నాకు తెలుసు."

"ఏమిటి నీకు తెలిసింది? ఎక్కడికి వెళ్ళాలో ఏం చెయ్యాలో అన్నవి చాత గానివాడి బుర్రలోకి వచ్చే ప్రశ్నలు. ఎక్కడికో అక్కడికి పరుగెత్తాలి. చేరా ల్సిన చోటు మనకు తెలుస్తుంది. అక్కడ మన ఆశాసౌధాలు నిర్మించుకోవచ్చు. ఎన్నో ఎన్నెన్నో చెయ్యచ్చు."

"పొరబడుతున్నావ్! నీకు, నీ శిష్యు లకి జీవితంలో చివరకు తెలియనితనం, తాపత్రయం మట్టుకే తోడుగా వస్తాయ్! ఏంచెయ్యాలో, ఎక్కడికి వెళ్ళాలో ఆలో చించుకోకుండా వుంటే చివరికి మిగిలేది ఈ వురుకులు పరుగులే!"

"సరే! నీ ఇష్టం! నేను వెళుతున్నాను నీవు రావా?"

"నీతో నా కనవసరం. నేను అన్నీ ఆలోచించుకునే వున్నాను. నేను అన్నీ నిర్ణయించుకొనే వున్నాను. నాకు ఈ కాలి నడక చాలు, నేను చేరాల్సిన చోటు చేర టానికి." ★